ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగ జరుపుకోండి



సాక్షి,సిటీబ్యూరో: యేసు క్రీస్తు జన్మదినోత్సవమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పవిత్రంగా జరుపుకుంటారన్నారు. జిల్లా ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



అజహర్

మేడ్చల్: ఆర్‌టీఐ మానవ హక్కుల సొసైటీ మండల అధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన మహమ్మద్ అజహర్ నియమితులయ్యాడు. ఈ మేరకు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ అజహర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మానవహక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని అజహర్ అన్నారు.

వినతి పత్రం అందజేత

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ రెసిడెన్షియల్ హైస్కూల్, జూనియర్ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్, బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్ కమిషనర్‌కు మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ మంగళవారం వినతి అందజేశారు. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలో, కళాశాలలో బోధించడానికి ఉపాధ్యాయులు లేక పేద విద్యార్థుల చదువు ముందుకు సాగడం లేదని లేఖలో తెలిపారు. అసౌకర్యాలతో నడుస్తున్న విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని గురుకుల్ పేరు మీదున్న ఆస్తులతో అభివృద్ధి చేయాలని కోరాడు.

డాక్టరేట్ ప్రదానం



నాగరాజు హరిమాణిక్యం

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో పనిచేస్తున్న నాగరాజు హరిమాణిక్యంకు డేటా సెక్యూరిటీపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. వెల్ టెక్ రంజ రాజన్ డాక్టర్ సగుంథల ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ డిగ్రీ తీసుకోవడం పట్ల నాగరాజును కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపక బృందం అభినందించింది.

స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డు బొక్కోనిగూడ నుంచి కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాల వరకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు మాజీ ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని లేఖలో తెలిపారు. అలాగే ఎరిమల్లే వాగు నుంచి కళాశాల వరకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలి



పోస్టర్ విడుదల చేస్తున్న పర్యావరణ వేత్తలు

మేడ్చల్: మహాకుంభ మేళకు తరలివెళ్లే భక్తులు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉండాలని పట్టణ పర్యావరణ వేత్తలు కోరారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రామాలయంలో కుంభ మేళ పోస్టర్‌లు విడుదల చేశారు. ప్రభుత్వం కుంభమేళలో ప్లాస్టిక్ నిషేధించిందని పర్యావరణ హితం కోసం అందరూ ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌కు చెందిన రఘురాంపటేల్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

పార్కు స్థలం కాపాడాలని వినతి



మేడ్చల్: పట్టణంలోని 1వ వార్డులోని శ్రీనివాస నగర్‌లో పార్కు స్థలం కాపాడాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. కాలనీ వాసులు కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ శ్రవణ్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాస నగర్ వెంచర్ ఏర్పాటు చేసిన సమయంలో ప్లాట్ నెంబర్ 52లో పార్క్ ఏర్పాటు చేయగా దానిని అన్యాక్రాంతం చేశారని సమస్య కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ కొంతమంది అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. పార్కు స్థలంను కాపాడాలని కౌన్సిలర్ శ్రవణ్‌తో పాటు కాలనీవాసులు కోరారు.

ఆలయ భూములకు

రక్షణ ఏది?

భూముల వివరాలు వెబ్ సైట్‌లో నమోదుకు ప్రభుత్వం ఆదేశం

- జీపీఎస్‌కు అనుసంధానం చేయాలని సూచన
- వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం
- జియో ట్యాగింగ్.. జీపీఎస్ ప్రక్రియలో జాప్యం



సాక్షి,సిటీబ్యూరో: దేవాలయాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అనేక ప్రాంతాల్లో ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించటం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఆలయ భూములు విషయంలో నెలకొన్న సమస్యలు తలెత్తకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల భూముల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసి, వాటిని జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)కు అనుసంధానించాలని సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. అయినప్పటికి ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, భూసర్వే, దేవాదాయ శాఖల మధ్య కొరవడిన సమన్వయం కారణంగానే ఆలయాల భూముల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు, జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)వంటి ప్రక్రియ ముందుకు సాగటం లేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం సర్కారు ప్రాధాన్యతల్లో భాగంగా.. ఇతర కార్యక్రమాల్లో పలు శాఖలు నిమగ్నమై ఉండటం వల్లనే జీపీఎస్ ప్రక్రియ కొనసాగటం లేదని పేర్కొంటోంది.

వందలాది ఎకరాలు అన్యాక్రాంతం

నగర శివారుల్లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతుండటంతో వాటి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం నడుంబిగించింది. కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించిన కోర్టు కేసులను పునః పరిశీలించటంతోపాటు త్వరలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్‌తోసహా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలలో మొత్తంగా దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు 21,386 ఎకరాలు ఉండగా, ఇందులో 5,462 ఎకరాల భూములు అక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఇందుకు ఉదాహరణగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట మండలం దేవరయాంజల్ సీతారామచంద్రస్వామి భూముల కబ్జాను అధికారులు పేర్కొంటున్నారు.

శాఖల మధ్య కొరవడిన సమన్వయం

రెవెన్యూ, భూసర్వే శాఖలతో దేవాదాయ శాఖకు కొరవడిన సమన్వయంతో ఆలయాల భూముల జియోట్యాగింగ్ ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలుస్తోంది. ఆలయాల భూముల జియోట్యాగింగ్ పూర్తి చేస్తేనే వాటిని కాపాడే అవకాశం ఉంటోంది. అధిక ఆదాయం, భూములు కలిగిన ఆలయాలను ఎంపిక చేసి జీపీఎస్ పూర్తిచేయాల్సి ఉంటోంది. దేవాదాయ శాఖ రెవెన్యూ, భూసర్వే శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవటం లేదని సమాచారం. దేవాదాయ శాఖ వర్గాలు మాత్రం జీపీఎస్ ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, త్వరలో పూర్తిచేస్తామని పేర్కొంటోంది.

వివిధ కోర్టుల్లో 760 కేసులు

నగర శివారుల్లో కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించి 760 కేసులు వివిధ కోర్టుల్లో కొనసాగుతుండగా వాటి పరిరక్షణపై ప్రత్యేక కసరత్తు చేస్తోంది. గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలలో ఇప్పటి వరకు 2,352 ఎకరాల భూములను వివిధ పద్ధతుల్లో పరిరక్షిస్తున్న దేవాదాయ శాఖ ముందస్తుగా తమ అధీనంలో ఉన్న భూముల రక్షణకు ఫెన్సింగ్ వంటి పటిష్టమైన చర్యలకు పూనుకోవాలని భావిస్తోంది. దేవాదాయ భూములకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో 5,217 ఎకరాలు ఉండగా, దీనికి సంబంధించిన భూములు మహారాష్ట్రంలో 2,500 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 354 ఎకరాల భూములు భద్రంగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 9,929 ఎకరాలు దేవాదాయ భూములు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 3,941 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 2,299 ఎకరాలు దేవాదాయ శాఖ భూములు ఉన్నట్లు పేర్కొంటున్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



సాక్షి,సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ ద్వారా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేరుతో వినతి పత్రాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు అందజేశారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించింది. దీనికి ముందు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని తూముకుంటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు ఘనంగా నివాళులర్పించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మేడ్చల్ కలెక్టరేట్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి మోమెరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కూనశ్రీశైలంగౌడ్, టీపీసీసీ ఉపాధ్యాక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జడ్పీమాజీ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ,జిల్లా నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, సరిత వెంకటేష్, మహ్మద్ ముజీబ్ రుద్దీన్, బ్లాక్, మండలం, మున్సిపల్, నగరపాలక సంస్థల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం నిధుల కేటాయింపు



సమావేశంలో చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ అభివృద్ధికి గత 5 సంవత్సరాల కాలంగా కౌన్సిలర్లందరి సహకారంతో ముందుకెళ్లడం జరిగిందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో అభివృద్ధి పనులకు రూ. 2 కోట్ల 30 లక్షల మేరకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మాణించడం జరిగిందన్నారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామ్యులు కావడంతో పాటు, తనకు పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు కౌన్సిలర్లందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మేనేజర్ చంద్రశేఖర్ తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్



సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే క్షేత్ర స్థాయిలో నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో సౌమ్యంగా మాట్లాడుతూ సర్వేకు అవసరమయ్యే వివరాలను మాత్రమే సేకరించాలని సర్వే అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ వత్సలదేవి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



మేడ్చల్: పట్టణంలోని 6వ వార్డులో 30 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠగౌడ్ ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్, వార్డు నాయకులు, కాంగ్రెస్ నాయకులుతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కౌన్సిలర్ సాయికుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, సత్యనారయణ, శంకర్, రమేష్, వార్డు నాయకులు, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

వంతెన భూ బాధితులకు నష్టపరిహారం ప్రక్రియ ప్రారంభం



బాధితుల వివరాలు సేకరిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య, న్యాయవాది రాఘవరెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య మంగళవారం ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది రాఘవరెడ్డితో కలిసి బాధితులకు నష్టపరిహారం ఇప్పించేందుకు బాధితల వివరాలు సేకరించారు. భూ బాధితులకు ఎంత స్థలం ఉంది, రోడ్డు విస్తరణలో పోతున్న భూమి, బాధితుల ఫొటోలు, ట్యాక్ బిల్లులు, దస్తావేజులు, బ్యాంక్ అకౌంట్ బుక్ తదితర వివరాలు కోర్టులో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, అనురాధా, మల్లేష్, నర్సింగ్‌రావు, రవీందర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, బాధితులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఉద్యోగ సంఘాల నిరసన

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ భూమి పరిరక్షణకు వెళ్లిన కాప్రా మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై కొందరు వ్యక్తులు దాడి చేయటాన్ని టీజీటీఏ, టీజీఆర్‌ఎస్‌ఏ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్ సర్వే నెంబర్ 645, 646లోని ప్రభుత్వ భూమిలో కొత్తగా వెలసిన మూడు అక్రమ కట్టడాలను మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్ తొలగిస్తుండగా కొందరు దుండగులు దాడి చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద రమేష్‌పై జరిగిన దాడికి నిరసనగా చేపట్టిన కార్యక్రమంలో టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శులు పూల్ సింగ్, పాక రమేష్, రాష్ట్ర టీజీఆర్‌ఎస్‌ఏ ప్రెసిడెంట్ రాంరెడ్డి, జనరల్ సెక్రటరీ బిక్షం, టీజీటీఏ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సెక్రటరీ హసీనా, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ



కిరీటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

మల్లాపూర్: నాచారంలోని పోలేరమ్మ దేవాలయంలో నూతనంగా ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహానికి 63 తులాల వెండి కిరీటాన్ని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ దంపతులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆందజేసి అలంకరించారు. మహంకాళి సహిత మహాకాళేశ్వర్‌స్వామి దేవాలయ ప్రధాన పూజారి నరసింహమూర్తి, పోలేరమ్మ ఆలయ అర్చకులు పవన్‌కుమార్, శర్మ, ఆలయ చైర్మన్ ప్రసాద్, శివరాంప్రసాద్, అధ్యక్షులు గౌడెల్లి సావిత్రి, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

సంస్కృతిలో భాగంగా క్రిస్మస్



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



అన్నోజిగూడలో విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చి



పోచారం: యేసుక్రీస్తు జననానికి గుర్తుగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు పోచారం మున్సిపాలిటీలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సంస్కృతిలో భాగంగా నిర్వహించే క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చిలు విద్యుత్ దీపాలతో ముస్తాబయ్యాయి. రోమన్ క్యాథలిక్, బాప్టిస్ట్, పెరాజీము, క్రీస్తుజ్ఞాన మందిరం వంటి ఆలయాల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుగనున్నాయి.

సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తా: వజ్రేష్‌యాదవ్



సాక్షి,సిటీబ్యూరో: సమగ్ర శిక్షా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఆయనను కలిసి వినతి పత్రం అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టం పూడ్చలేనిదని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరిస్తూ.. వస్తున్నారని పేర్కొన్నారు. మీ సమస్యను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

మెడికల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ శిక్షణ



సాక్షి,సిటీబ్యూరో: బస్తీ దవాఖానాల్లో కొత్త నియమితులైన మెడికల్ ఆఫీసర్లు తగిన కార్యాచరణతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డా. టీ.రఘునాథ్ స్వామి తెలిపారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మెడికల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ శిక్షణలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్తీ దవాఖానాలలో తమ పనితీరును విస్తృతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. గర్భిణీలకు నిర్ధారణ పరీక్షల నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓపి సేవలతోపాటు తక్షణ వైద్య అవసరాలను తీర్చడంలో వైద్యుల పాత్ర కీలకమైందన్నారు. నిర్దేశించిన పనివేళలను పాటించటంతోపాటు సమాజ ఆరోగ్య అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుని మెడికల్ ఆఫీసర్లు పనిచేయాలన్నారు. బస్తీ దవాఖానాల ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయాలన్నారు. నాణ్యమైన సేవలు లక్ష్యంగా పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డా.సరస్వతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి (ఎహెచ్‌ఎమ్) మంజులారాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలపాలిట వరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఉప్పల్ మండల పరిధిలో దాదాపుగా 160 మంది లబ్దిదారులకు రూ. కోటి 60 లక్షల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్, మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, శాంతి, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్‌లతో కలిసి పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తహసీల్దార్ వాణిరెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, ప్రవీణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు





విద్యుత్ దీపాలలో మేడ్చల్ ఉమానగర్ చర్చి



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో.. నృత్యం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకునే క్రిస్మస్ పండగ సందర్భంగా మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలో, మండలంలోని వివిధ గ్రామాలలోని చర్చిలు అందంగా ముస్తాబు అయ్యాయి. జింగిల్ బెల్స్, క్రిస్మస్ ట్రీ, ఏసు జననం వంటి సన్నివేశాలతో చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్, అత్వెల్లి, పట్టణంలోని వివిధ కాలనీలలో, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాలలో క్రిస్మస్ శోభ అధికంగా సంతరించుకుంది.

కీసరలో..

రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ బి.పద్మ మాట్లాడుతూ.. ఇతరుల పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు క్రీస్తు ఘనతను నాటిక రూపంలో ప్రదర్శించారు. అలాగే నృత్యాలు, గానాలాపనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు.

నాగారం సెరినిటీ పాఠశాల్లో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సెరినిటీ పాఠశాల్లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కార్యదర్శి నోముల వసంత తదితరులు పాల్గొన్నారు.

రాక్‌ఉడ్స్ స్కూల్‌లో వేడుకలు..

కీసర: నాగారంలోని రాక్‌ఉడ్స్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ.. ఏసు జనన వృత్తాంతాన్ని ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా స్కూల్ చైర్మన్ రామానాయుడు, సీఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం పద్మ అయ్యంగార్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు క్రిస్మస్ బహుమతులు, స్వీట్స్ పంపిణీ చేశారు.





నాగారం సెరినిటీ పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలు



రాక్‌ఉడ్స్‌లో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు